

ప్రభుత్వంపై అవాస్తవాల ప్రచారం

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ సిఎం చంద్రబాబు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ ఎంఎల్‌సితోట త్రిమూర్తులు అన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసింది చంద్రబాబేన్నారు. ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో గ్రావెల్ తరలించుకుపోయింది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. అక్రమ గ్రావెల్ తరలింపు కారణంగానే ద్వారపూడిలో నిర్మించాల్సిన పెట్రోప్రాజెక్ట్ వెనక్కి పోయిందన్నారు. హత్య కేసులో నిందితులుగా ఉన్న వారిని చంద్రబాబు వెంట పెట్టుకుని తిరుగుతున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అబ్జర్వర్ వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, పార్టీ నాయకులు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజబాబు, సాధనాల శివ భగవాన్ తదితరులు పాల్గొన్నారు

సర్పంచులకు నిధులూ విధులేవీ..

- నిధులు, విధులను దూరం చేసిన సర్కారు
- కోనసీమలో జె(జగ్గిరెడ్డి) ట్యాక్స్ అమలు
- రావులపాలెం బహిరంగ సభలో చంద్రబాబు ఆరోపణలు

ప్రజాశక్తి- రావులపాలెం, మండపేట

నిధులు ఇవ్వకుండా, విధులను నిర్వర్తించనీయకుండా వైసిపి ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం ఆయన కొత్తపేట నియోజకవర్గంలో ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో పర్యటించారు. తొలుత ఆలమూరు-మండపేట రోడ్డులోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. గ్రామాల్లో సర్పంచులకు బదులు వాలంటీర్లు, వైసిపి నాయకుల పాలన జరుగుతుందన్నారు. సర్పంచ్‌కి కూడా తెలీకుండా నిధులను నొక్కేస్తున్న ఘనత వైసిపి సర్కారుకే దక్కిందన్నారు. గోదావరి జిల్లాలో ఇసుక మాఫియా కోరలు చాస్తుందన్నారు. ఇదంతా సిఎం కనుసన్నల్లోనే సాగుతుందన్నారు. ఇసుక పుష్కలంగా దొరుకుతున్నా ఇక్కడ ప్రజలకు మాత్రం అందుబాటులో ఉండట్లేదన్నారు. నాణ్యమైన ఇసుకను మాఫియా విశాఖ తదితర ప్రాంతాలకు తరలించేసి కోట్లాది రూపాయలను పోగేసుకుంటుందన్నారు. ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ప్రోద్బలంతో తాడి మోహన్‌రెడ్డి అనే బినామీ తయారయ్యాడన్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో ఏ ఒక్కరూ ఆనందంగా లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా సునామీలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకి తాను గ్యారెంటీ ఇస్తానన్నారు. ఎనిమిది సార్లు కరెంట్ ఛార్జీలుపెంచిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఆర్‌టిసి ఛార్జీలు, చెత్త తదితర పన్నులతో ప్రజలను బాదేస్తున్నారన్నారు. నాసిరకం మద్యాన్ని అమ్ముతూ పేదల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటుందన్నారు. మహాశక్తి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మంత్రి జవహర్, మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంటి హరీష్ మాథుర్, మండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎంఎల్ఎలు నిమ్మకాయల చినరాజప్ప, బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంఎల్ఎలు గొల్లపల్లి సూర్యారావు, జ్యోతుల నెహ్రూ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులో చంద్రబాబు ప్రయాణం

ఆలమూరు: కోనసీమ జిల్లాలో పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఆలమూరు నుంచి జొన్నాడ వరకూ సుమారు 5 కిలోమీటర్ల మేర ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. కండక్టర్ వద్ద టిక్కెట్ కొన్న ఆయన బస్సుల్లో పలువురు మహిళలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర ధరలు, ప్రభుత్వ పన్నులు, కరెంట్ ఛార్జీల పెంపు తదితర విషయాలను మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.



రావులపాలెంలో చంద్రబాబు పాల్గొన్న బహిరంగ సభకు హాజరైన ప్రజలు. (ఇన్‌సెట్)లో అభివాదం చేస్తున్న చంద్రబాబు

చంద్రబాబుకు ఘన స్వాగతం

కొత్తపేట: జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపేట నియోజక వర్గం రావులపాలెంలో బహిరంగ సభ అనంతరం అమలాపురం వెళుతూ స్థానిక పాఠశాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో స్థానిక పాత్ బస్టాండ్ వద్ద ఘన స్వాగతం పలికారు

చంద్రబాబు పర్యటన సందర్భంగా నేడు ట్రాఫిక్ మళ్లింపు

అమలాపురం: ఎపి ప్రతి పక్ష నేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు అమలాపురంలో శుక్రవారం పర్యటన బహిరంగ సభ కు సంబంధించి ట్రాఫిక్ మళ్లింపు చేసినట్లు అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం మీదుగా వెళ్ళు ఆటోలు, కార్లు, లారీలు, బస్సులు ఇతర రవాణా వాహనములన్నీ అమలాపురం పట్టణం లోనికి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంట వరకు అనుమతించబడవనీ ఆ సమయములో ఆయా వాహనములు క్రింద తెలిపిన విధంగా మళ్లించబడతాయనీ డిఎస్‌పి తెలిపారు.

1)ముమ్మిడివరం నుంచి అమలాపురం మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు కొండలమ్మ చింత మీదుగా క్రాప, కె .జగన్నాధపురం, తొత్తరమూడి, ముక్తేశ్వరం, మడుపల్లి మీదుగా వెళ్లాలి. 2) ముమ్మిడివరం, ఉప్పలగుప్తం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు అనాతవరం-మాగం-సిరిపల్లి- ముక్తేశ్వరం- అయినవిల్లి- మడుపల్లి మీదుగా వెళ్లాలి. 3) కాకినాడ నుంచి అమలాపురం మీదుగా రాజోలు వెళ్లే వాహనాలు భట్నవిల్లి బైపాస్ మీదుగా చిందాడగరువు - రోళ్లపాలెం - పేరూరు వై.జంక్షన్ మీదుగా వెళ్లాలి. 4) రాజోలు నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు : పేరూరు, వై.జంక్షన్ బైపాస్ మీదుగా రోళ్లపాళెం -చిందాడ గరువు - భట్నవిల్లి మీదుగా వెళ్లాలి. 5) రాజోలు, నగరం నుంచి అమలాపురం మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు బోడసకుర్రు బ్రిడ్జి - తోట్లపాలెం - వాకలగరువు - నందంపూడి- అంబాజీపేట మీదుగా వెళ్లాలి.6) అమలాపురం నుంచి అంబాజీపేట రావులపాలెం వెళ్లే టూవీలర్స్, ఆటోలు ఎత్తురోడ్డు-బి విసి కాలేజ్- ఇందుపల్లి బ్రిడ్జి మీదుగా వెళ్లాలి.7) అమలాపురం నుంచి ముక్కామల, రావులపాలెం వెళ్లే టూవీలర్స్, ఆటోలు నల్లవంతెన-జనుపల్లి-నేదునూరు, ముక్కామల(లేదా)నల్లవంతెన-నడిపూడి కాలువగట్టు మీదుగా వెళ్లాలి.8) ఎర్రవంతెన మీదుగా పేరూరు వై జంక్షన్ వెళ్లే టూ వీలర్స్, ఆటోలు ఎర్రవంతెన-విత్తనాల కాలువగట్టు- వడ్డిగూడెం-సాయిబాబా టెంపుల్-గోఖలే సెంటర్ మీదుగా వెళ్లాలి.

మడికి టిడిపి భారీ బైక్ ర్యాలీ

ఆలమూరు: మండలంలోని మడికి గ్రామ టిడిపి ధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, స్థానిక సెంటర్ వద్దకు చేరుకుని బాణసంచా కాల్చారు. అనంతరం రావులపాలెంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి కొత్తపేట టిడిపి ఇన్‌ఛార్జి బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మడికి నుండి సుమారు 300 ద్విచక్ర వాహనాలలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు మరో 20 ఆటోల్లో మహిళ కార్యకర్తలు ర్యాలీగా జొన్నాడ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడి నుండి చంద్రబాబు కాన్వాయ్ తో కలిసి రావులపాలెంకు తరలి వెళ్లారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సిఐటియు రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు అమలాపురం మున్సిపల్ ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ధర్నా, మానవహారం నిర్వహించారు. కార్యక్ర మానికి సిఐ టియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా పర్మినెంట్ చేస్తానని ఆనాడు హామీ ఇచ్చారన్నారు. కానీ ఈ రోజుకీ ఆ హామీలు అమలు చేయకపోవడం దురదృష్టకరమ న్నారు. పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి పారిశుధ్యం పనులు చేస్తుంటే కనీసం వీరికి సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, యూనిఫామ్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. మున్సిపల్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చడం వల్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.గోపి, నిమ్మకాయల దుర్గ, కుమారి, లీలావతి, తలుపులమ్మ, సత్యవతి, వరలక్ష్మి, సాయిబాబు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైయస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు, ఫోర్ జి మొబైల్ టవర్లకు భూసేకర ణ, వ్యవసాయం పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివద్ధి, జగనన్న పాల వెల్లువ చిరుధాన్యాల సాగుకు ప్రోత్సహం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరె న్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రీ సర్వే సంబంధిం చిన సర్వే ప్రక్రియలను సమాంతరం గా చేపడుతూ నిర్దేశిత సమయానికి సర్వే పూర్తి చేయాలన్నారు. మల్టీ ప ర్పస్ ఫెసిలిటేటెడ్ గోదాముల నిర్మా ణానికి అనువైన స్థలాలను 25 సెంట్లు మేర ప్రభుత్వ భూములను లేదా ప్రత్యామ్నాయ భూములను రాకపోకలకు అనువుగా ఉండే స్థలాలను సేకరించాలని సూచిం చారు. ఖరీఫ్ సీజన్లో వేసిన నారుమళ్లు, గోదావరి వరద ముంపు మూలంగా దెబ్బతిన్న రైతులకు పరి విత్తనాలు అందించి మరల నారుమళ్లు సిద్ధం చేసి ఖరీఫ్ సాగుకు సమాయత్తం చేయడం జరిగిందన్నారు. గోదావరి వరద మూలంగా నష్టపోయిన ఉద్యాన పంటల అంచనాలను రూపొందించి సామాజిక తనిఖీ నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాలు సాగును ప్రస్తుతం ప్రకటించిందని ఆ దిశగా వర్షపాతం తక్కువగా ఉన్నచోట్ల చిరు ధాన్యాల సాగును వాటి ఉత్పత్తుల సేకరణను ప్రోత్సహించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, జిల్లా గహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ సిహెచ్.బాబురావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసు బాబు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజోలు


కళాశాల్లో అడ్మిషన్ పొంది విద్యార్థులకు ఫీజు నిమిత్తం పలువురు దాతలు ఆర్థికసాయం గురువారం అందజేశారు. మలికిపురం మండలం కేశనపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-24 సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అడబాల శ్రీ ఆంజనే యులు, అడబాల వెంకట స్వామి నాయుడు ముందుకు వచ్చి విద్యార్థులు ఫీజుల నిమిత్తం రూ.53 వేలను గ్రామ సర్పంచ్ యెనుముల నాగు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ యాళ్ల లక్ష్మణరావు అన్నారు. కళాశాలలో ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం ప్రతి ఏడాది తమ వంతు సహాయ సహకారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. శ్రీ ఆంజనే యులు, స్వామినాయుడులకు అధ్యాపకు లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియ జేశారు. కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ఐ .పోలవరం- మురమళ్ళ విద్యుత్ సబ్-స్టేషన్ కు విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిలుపుదల చేయబడునని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రీ కటింగ్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామములకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారనారు. **ఐ.పోలవరం:** శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ మోక రవికుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాట్రేనికోన, చెయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలో చెట్లు తొలగింపు పనులు చేపడతామన్నారు. అన్ని గ్రామాల్లో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కార్టూ'నిజం'



గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం



భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల సదుపాయాల కల్పనే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు ఆయన గురువారం వెలిచేరు గ్రామంలో రూ.62 లక్షల వ్యయంతో చేపట్టే తాగునీటి పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ ఒక్కరికీ పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలనే సంకల్పంతో రూ.28 లక్షల వ్యయంతో 40,000 లీటర్ల కెపాసిటి గల వాటర్ ట్యాంక్ నిర్మాణం, రూ.34 లక్షల వ్యయంతో పైప్ లైన్ నిర్మాణం చేస్తామన్నారు. అలాగే గ్రామస్థుల కోరిక మేరకు గ్రామంలో అంగనవాడీ కేంద్రం భవనం నిర్మాణం చేయడానికి కూడా అంగీకరించి, అవసరమైన స్థలాన్ని తీర్మానం ద్వారా ఇవ్వాలని గ్రామ సర్పంచి వేముల శ్రీనివాస్‌కి సూచించారు.. కార్యక్రమంలో సర్పంచి వేముల శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యుడు వేముల వెంకట రమణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, కనుమూరు శ్రీనివాస రాజు, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నరసింహారావు, ఎఇ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలకు కృషి చేయాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు, గిరిజా కుమారి తదితరులు

అమలాపురం మార్కెట్ కమిటీ రైతు ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయాలని డాక్టర్ వైఎస్ఆర్ హార్టీ కల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు సూచించారు. మండలానికి చెందిన ఎఎంసి వైస్ చైర్మన్‌గా బడుగు మేరీ కుమారి, డైరెక్టర్‌లుగా నిమ్మకాయల కోటేశ్వరరావు, చప్పిడి దుర్గారావు, అంగాని సీతామహాలక్ష్మి లు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా గురువారం నంగవరం సచివాలయంలో స్థానిక సర్పంచ్, హార్టీకల్చర్ యూనివర్సిటీ కోర్టు సభ్యుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజా కుమారి, వ్యవసాయ సలహా మండలి మండల డైరెక్టర్ రాయపు రెడ్డి నాగు ,రైతు నాయకులు జంపన బాపిరాజు, శీలం సూరిబాబు, దొమ్మేటి కిషోర్ తదితరులు ఎఎంసి వైస్‌ఛైర్మన్, డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన వారిని సత్కరించి, నూతన వస్త్రాలు అందజేశారు. వైసిపి నాయకులు బడుగు శ్రీను, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

జిల్లా వెలుగు యానిమేటర్స్ సమావేశంలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు రమాదేవి

అంబేద్కర్ కోనసీమ జిల్లా వెలుగు యానిమేటర్స్ సమావేశం గురువారం యానిమేటర్ జ్యోతి అధ్యక్షతన అమలాపురం యుటిఎఫ్ హోమ్ నందు నిర్వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, యానిమేటర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అనేక పోరాటాలతోనే వేతనాలు సాధించు కున్నామని అన్నారు. విఒఎలు తలుచుకుంటే ప్రభుత్వాన్ని గద్దించగలరని, తక్షణమే విఒఎలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 5 జి సిమ్ములు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అమలుజేయాలని లేనీ పక్షంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల విఒఎలను చాలా వేధింపులకు గురి చేస్తున్నారని అలాగే అధికారులు కూడా రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతూ అనేక చోట్ల ఇబ్బందులు పెడుతున్నారనీ అన్నారు. విఒఎలకు రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలని చెప్పి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విఒఎల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలుగా కె.కృష్ణవేణి, జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా పాము వెంకటలక్ష్మి, కోశాధికారిగా ఎన్.జ్యోతి తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

సర్పంచ్‌కు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్



సర్పంచ్ అరుణను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

కొంత కాలంగా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అమలాపురం రూరల్ మండలం పేరూరు సర్పంచ్ దాసరి అరుణ ను గురువారం ఆమె స్వగహం లో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు పలు ఆరోగ్య సంబంధిత సూచనలు చేశారు. త్వరగా కోలుకొని ప్రజా సేవలో ముందుకు సాగాలని అన్నారు. మంత్రితో పాటు జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, చెల్లుబోయిన శ్రీనివాస్, బొంతు గోవింద్ శెట్టి, కేత భానుతేజ, దాసరి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



లెక్కింపునుపరిశీలిస్తున్న ఆలయచైర్మన్ వాసురాజు

వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయం గురువారం దేవాదాయశాఖ తనిఖీఅధికారి రామలింగేశ్వరరావు సమక్షంలో, ఛైర్మన్ పెన్మత్స వాసురాజు, ఇఒ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. నిత్య కల్యాణం వద్ద కట్న కానుకలు హుండీ ద్వారా రూ.10,73,229, ప్రధాన హుండీల ద్వారా రూ 7,98,372, అన్నదానం హుండీ ద్వారా రూ.1,28,053 మొత్తం 5 నెలల ఒక్కరోజు కు రూ.19,99,9654 సమకూరినట్లు తెలిపారు. ఈమొత్తాని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఛైర్మన్ కొలిశెట్టి గంగ బాబు, గ్రామస్తులు, పోలీస్, రెవెన్యూ, శ్రీనివాస సేవా సమితి, అంబాజీపేట, శ్రీ భీమేశ్వర సేవా సమితి, అమలాపురం నుంచి పాల్గొన్నారు.



క్రీడా దుస్తులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

క్రీడా దుస్తుల బహూకరణ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పాలగుమ్మి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న బి.జయశ్రీ తన తండ్రి బి.పవన మూర్తి (రిటైర్డ్ ఎస్సై) జ్ఞాపకార్థం రూ.25 వేలు విలువ గల 50 జతల క్రీడా దుస్తులను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అందజేశారు. క్రీడా దుస్తులను పాఠశాల హెచ్ఎం జి. వెంకటేశ్వరరావు విద్యార్థులకు అంద జేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు పాలగుమ్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

'డార్క్ ఫాంటసీ'కి బ్రాండ్ అంబాసిడర్‌గా 'షారూఖ్ ఖాన్'

ప్రజాశక్తి-అమలాపురం

ఐటిసి యొక్క సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ తమ బ్రాండ్‌కి నూతన ప్రచారకర్తగా 'కింగ్ ఆఫ్ ఫాంటసీ' షారుఖ్ ఖాన్‌ను ఎంపిక చేసినట్టు గురువారం ఒక ప్రకటనలో కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఐటిసి ఫుడ్స్, బిస్కట్స్, కేక్స్ సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ తమ వినియోగదారులతో అనుబంధాన్ని ఏర్పర చుకునే లక్ష్యంతో 'సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ - హర్ దిల్ కి ఫాంటసీ' అనే తమ పునరుద్ధరించిన బ్రాండ్ ప్రతిపాదనను పరిచయం చేసిందన్నారు.

తాపేశ్వరంలో పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-మండపేట


తాపేశ్వరం పంచాయతీలో 14వ వార్డుకు 19న ఉప ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు గురువారం పరిశీలించారు. ఏడిద 1వ వార్డు, తాపేశ్వరం 14వ వార్డు సభ్యుల మతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏడిద పంచాయతీకి సంబంధించి అడపా నీలజ్యోతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో పరిశీలన అనంతరం ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. తాపేశ్వరం పంచాయతీకి సంబంధించి వార్డు బిసి జనరల్ రిజర్వు కాగా మొత్తం ఐదు నామేషన్లు దాఖలయ్యాయి. స్రూట్నీలో ఒకటి తిరస్కరణకు గురికాగా ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఇద్దరు పోటీలో నిలవడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. బరిలో నిలిచిన మేడిశెట్టి వీరేంద్రకు గౌను గుర్తు, పెంకే కనకలింగేశ్వరరావుకు ప్రెషర్ కుక్కర్ గుర్తులను కేటాయించారు. 19వ తేదీన ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్, అనంతరం అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి విజేతను ప్రకటిస్తారు.

తాపేశ్వరం వార్డు ఎన్నికపై అవగాహన

తాపేశ్వరం 14వ వార్డుకు ఉప ఎన్నిక ఈనెల 19న జరగనున్న నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్ని కపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఆత్రేయపురం: ఈనెల 19న జరగనున్న ర్యాలి గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డు ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు ర్యాలీ.. బుల్లిరేవు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు.అనంతరం సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాల యంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతి నిర్వహిం చారు. స్టేజ్-2 ఎన్నికల అధికారిగా కె.సూర్యనారాయణ, సఖినేటిపల్లి ఇఒఆర్‌డిని జిల్లా అధికారులు నియమించారన్నారు. ఈ కార్యక్రమం లో ఇఒఆర్‌డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాపేశ్వరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

అభ్యర్థుల ప్రచారం

ఐ.పోలవరం: ఈ నెల 19న సర్పంచ్,వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సీతమ్మ చెరువు 3వ వార్డు మెంబర్ గుత్తాల చైతన్య శ్రవణ్ కుమార్ మరణించటం వల్ల ఆస్థానంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గురువారం వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు గుత్తాల జ్యోతి, సవరపు వెంకట్ ఇంటింటికి వెళ్లి ప్రచారంచ చేశారు.

సర్పంచులు, వార్డ్ సభ్యుల ఖాళీలకు పోలింగ్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డ్ మెంబర్ల సాధారణ ఖాళీలకు సంబంధించి రామచంద్రపురం ఓదుర్రు సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ యథావిధిగా జరుగుతుందని డిపిఒ వి.కృష్ణకుమారి తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరం 13వ వార్డుకు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి గ్రామ మూడో వార్డుకు, మండపేట మండలం తాపేశ్వరం గ్రామ 14వ వార్డుకు, ఆత్రేయపురం మండలం ర్యాలి ఒకటో వార్డుకు, అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామ నాలుగో వార్డుకు, రావులపాలెం మండలం ఊబలంక మూడో వార్డుకు, అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి ఐదో వార్డుకు అదే మండల పరిధిలోని పాలగుమ్మి ఆరో వార్డుకు, ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామ ఏడవ వార్డుకు, పి గన్నవరం మండలం కుందలపల్లి ఏడో వార్డుకు, ముంగండపాలెం గ్రామ పదో వార్డుకు, కాట్రేనికోన మండలం బంటుమిల్లి గ్రామ మూడో వార్డుకు, కాట్రేనికోన గ్రామ 5, 6 వార్డులకు, కుప్పిగుంట గ్రామ పదో వార్డుకు, రాజోలు మండలంలో మెరకపాలెం గ్రామ పదో వార్డుకు, మలికిపురం మండలంలో పడమటిపాలెం గ్రామ ఐదో వార్డుకు, కపిలేశ్వరపురం మండలంలోని టేకి గ్రామ 8వ వార్డుకు, మండపేట మండలంలోని ఏడిద గ్రామ ఒకటో వార్డుకు, ఆత్రేయపురం మండలం లోని నార్కడిమిల్లి గ్రామ ఆరో వార్డుకు, బొబ్బర్లంక గ్రామ పదో వార్డుకు, అల్లవరం మండలంలోని గొడిలంక సర్పంచ్ పదవులను వార్డ్ సభ్యులను ఆయా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

నేరాలు ఘోరాలు


అదుపు తప్పి బోల్తా పడిన లారీ

అదుపు తప్పిన లారీ

ప్రజాశక్తి-గోపాలపురం

అదుపుతప్పిన లారీ విద్యుత్ స్తంభాన్ని, కనకదుర్గమ్మ ఆలయాన్ని ఢీకొట్టిన సంఘటన గోపాలపురం శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం వైపు నుండి రాజమండ్రి వైపు వస్తున్న లారీ గోపాలపురం శివారులోకి వచ్చేసరికి అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

బ్లేడుతో దాడి కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- గోకవరం

వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన కేసులో ముద్దాయికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని గోకవరం ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం గోకవరం గ్రామానికి చెందిన సింగవరపు ఏసు ప్రసాద్ 2018లో గోకవరం డ్రైవర్ కాలనీకి చెందిన బదిరెడ్డి దుర్గాప్రసాద్‌పై పాత కక్షలతో బ్లేడ్‌తో దాడి చేశాడు. అప్పటి గోకవరం ఎస్సై ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐ శివ నాగబాబు చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయి ఏసు ప్రసాద్‌పై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ తీర్పు చెప్పారన్నారు.

వేధింపుల కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 1న అమలాపురం పట్టణం, ఎర్రవంతెన వద్ద ఉన్న శ్రీనివాస సీఫుడ్స్ కంపెనీలో ఉరేసుకుని చనిపోయిన కంపెనీ బాలం శ్రీనివాసరావు కేసులో ఇప్పటివరకు ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతికి కారణమైన నిందితుడు అడపా దుర్గ సత్య పవన్, మురమళ్ల శివ వీరారెడ్డి నాయుడును రిమాండ్‌కు తరలించమన్నారు. ఈ కేసు సమగ్ర దర్యాప్తు అనంతరం లభించిన సాక్ష్యధారాలు మేరకు ఐపిసి సెక్షన్ 306, 34 కేసుగా నమోదు చేసామన్నారు. ఇంకా పలువురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గా శేఖర్ రెడ్డి నతృత్వంలో ఎస్ఐ హరీష్ కుమార్ బందం ఈ కేసు దర్యాప్తు చేస్తోందని డిఎస్‌పి తెలిపారు.


విజన్ ఆధ్వర్యంలో నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

విజన్ ఆధ్వర్యంలో నిత్యవసరాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో క్లబ్బు కార్యదర్శి ఎస్.శ్రీదేవి రెడ్డి సౌజన్యంతో వ్యాధిగ్రస్తులకు గురువారం నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషం ఏదోకమూల నిరాశ్రయులకు సేవ చేసే ఏకైక సంస్థ లయన్స్ క్లబ్ అని అన్నారు. ఆ దిశగా తమ లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మనమెంత సంపాదించుకున్నాం అనేది ముఖ్యం కాదని, మనం ఎంతమందికి సహాయం చేశామన్నది ముఖ్యమన్నారు. ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు సమకూరుస్తున్న శ్రీదేవి రెడ్డి సేవలు అభినందనీయమని ప్రసూన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ శ్రీరామ్ గణేష్ ప్రసాద్, బి. వాణి, రమాసుందరి, శిరీష ,అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌కు వాటర్ యంత్రం అందజేత

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పాగా సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత పాగా సురేష్ కుమార్ గురువారం సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగుల కోసం మినరల్ వాటర్ మిషన్‌ను అందజేశారు. చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాగా వెంకటలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఈ యంత్రం అందించారు. ఈ సందర్భముగా పాగా సురేష్ కుమార్ మాట్లాడుతూ సేవా అనే దృక్పథంతో తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను తమ ట్రస్ట్ ద్వారా నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ రెడ్నం సునీత, మాజీ కౌన్సిలర్ పాగా శిరీష, డాక్టర్లు పాల్గొన్నారు.

భూమి పాస్ బుక్స్‌లో 90 శాతం తప్పులు


ప్రజాశక్తి -కరప

గ్రామంలో జరిగిన భూ రీసర్వే అనంతరం వచ్చిన పాస్ బుక్స్ 90 శాతం తప్పులతో వచ్చాయని గ్రామస్తులు తెలుపుతున్నారని, వాటిని సరి చేయాలని కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ అన్నారు. గురువారం జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా వేములవాడలో స్థానిక నాయకులు మిరియాల రాంబాబు, కృపాదానం, మహేష్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుకోవడానికి ఇంటింటికీ వెళుతున్న జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీకి గ్రామంలో మహిళలు, ప్రజలు సమస్యలను తెలిపారు. 100 కుటుంబాలు నివసించే ఇబిసి కాలనీకి డ్రైనేజీ నిర్మించి నీరు పోయే మార్గం చూపలేదని ప్రభుత్వం ఇచ్చిన స్థలం లో గహాలు కట్టుకున్న వారికీ విద్యుత్ సౌకర్యం లేదని, ఎన్ని సార్లు అర్జీలు పెట్టిన అధికారులు స్పందించడం లేదని తెలిపారు.

సుంకటరేవులో గడపగడపకూ..

ప్రజాశక్తి - తాళ్లరేవు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో ఎంఎల్ఎ సతీష్ కుమార్ ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధి కరపత్రాలను ప్రజలకు పంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద్ కుమార్, రాయుడు గంగాధర్, ఎంపిటిసి బల్ల సంధ్యారాణి, ఎరికే దుర్గా వీరబాబు, దడాల ప్రసన్నకుమార్, భూసారపు పద్మారావు, ఆకుల వెంకన్న, మోకా మధు, గునిపే విష్ణు, శేషారావు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ

మార్గదర్శి చిట్స్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-పెద్దాపురం రోడ్డులోని మార్గదర్శి చిట్స్ కార్యాలయంలో గురువారం కమర్షియల్ టాక్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారుల తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోకి మీడియాను అధికారులు అనుమతించలేదు. దీంతో వివరాలు తెలియరాలేదు.

వందేభారత్ రైలు రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్ప్రెస్ గురువారం రద్దయ్యింది. సాంకేతిక కారణాలతో రైలును ఇవాళ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవాళ ఉదయం 5.45 గంటలకు ఈ రైలు బయల్దేరాల్సి ఉంది. ఈ రైలుకు ప్రత్యామ్నాయంగా మరో రైలును ఏర్పాటు చేశారు. ఇది ఉదయం 7 గంటలకు బయలుదేరింది. ఈ రైలు కేవలం వందేభారత్ స్టాపుల్లోనే ఆగుతుందని రైల్వే అధికారులు వెల్లడించారు. సకాలంలో రైలు రాకపోవడంతో ప్రయాణం కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు ఇక్కట్లకు లోనయ్యారు.

పోషకాహారంతో శరీర పెరుగుదల

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మన శరీరానికి అవసరమైన అన్ని పదార్థాలను శరీరం స్వయంగా తయారు చేసుకోలేదని ఆహార పదార్థాల ద్వారా వాటిని అందించాలని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆహారం ఆరోగ్యాన్ని నిర్దేశిస్తుందనేది వాస్తమని, సరైన పోషక విలువలు గల ఆహార పదార్థాలను అందించక పోతే పోషకాహార లోపం ఏర్పడుతుందన్నారు. దీనివలన బుద్ధి మాంధ్యత ఏర్పడుతుందని అన్నారు. మన భావోద్వేగాలు, ప్రవర్తనను కార్బోహైడ్రేట్లు ప్రభావం చేస్తాయని అన్నారు. గోధుమ, వరి, పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకోవాలని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతుకూలి సంఘం నాయకులు

రామేశం మెట్టపై అక్రమ మైనింగ్ ఆపాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రామేశం మెట్టపై అక్ర మైనింగ్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్రామాల దళితులకు 960 ఎకరాల భూమిని ఈ మెట్టపై పంపిణీ చేశారన్నారు. 1987లో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సాగుకు అనుకూలంగా కరెంటు, బోరులు వేయించారన్నారు. అటువంటి మెట్టను తమ లాభాల కోసం మట్టి మాఫియా దోచుకుంటున్నారన్నారు. ఈ ధర్నాలో డి.సురేష్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో పిడబ్ల్యుడి నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భూమిపూజ చేశారు. ఈ మేరకు మెట్టకూరు మూడు తూములు వద్ద మెయిన్ రోడ్డు పనులు, మెట్టకూరు పిజెఎన్ ప్రభుత్వ పాఠశాల అభివద్ధి, జనరల్ హాస్పిటల్‌లో మెటర్నిటీ వార్డు, ఒపిడి బ్లాక్, దరియాలతిప్పలో ఓల్డ్ ఒహెచ్‌టి పంపుసెట్టు ఆధునీకరణ, గిరియంపేటలో వాటర్ ట్యాంక్ ఆధునికరణ తదితర పనులు అభివద్ధి చేయనున్నట్లు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఇ మునిస్వామి, పిడబ్ల్యుడి ఇఇ వీరసెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, జెఇలు భగవాన్, వీరాస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కాటంశెట్టి రామ్మూర్తి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం


రామ్మూర్తిని అభినందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

ప్రముఖ వ్యాపారవేత్త, తెలగా (కాపు) అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి పుట్టినరోజు వేడుకలు అభిమానులు, స్నేహితులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యానాం బైపాస్‌లో ఉన్న ఆయన ఆఫీస్‌లో ఉదయం 8 గంటల నుండి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రామ్మూర్తికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక ముమ్మిడివరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సమక్షంలో భారీ కేకును కట్ చేసి విద్యార్థినులకు స్వీట్లు పంచారు. 600 మంది విద్యార్థినులకు భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత యానాంలో ఉన్న గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కనకాలపేటలో ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థిని, విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిల్స్, కాంపస్ బాక్సులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి నేతలు, రామ్మూర్తి కుటుంబ సభ్యులు,అభిమానులు,స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధుని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - యానాం

వద్ధుడు యానాం బాలయోగి వారధి పైనుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. పోలీసుల వివరాల ప్రకారం తాళ్ళరేవు సీతారాంపురం గ్రామానికి చెందిన గాదే రాజు రామచంద్ర రాజు కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గోదావరి దూకిన వెంటనే కొంతమంది వ్యక్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు.అక్కడే ఉన్న సీగల్స్ బోటు సహాయంతో ఆ వద్ధుడిని కాపాడారు. ప్రథమ చికిత్స కోసం యానాం జిజిహెచ్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - యానాం

గుండెపోటుతో లారీ డ్రైవర్ మతి చెందాడు. ఈ సంఘటన యానాం పరిధిలోని బైపాస్ రోడ్‌లో గురువారం జరిగింది. ఎస్ఐ శేరు నూకరాజు వివరాల ప్రకారం..తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట, కోదాడకు చెందిన గంటా అంజయ్య (60) అమలాపురం వెళ్లాల్సి ఉండగా బుధవారం రాత్రి యానాం బైపాస్ హెచ్పి పెట్రోల్ బంక్ సమీపంలో విశ్రాంతి కోసం లారీని పక్కకు పార్క్ చేశాడు. అదే సమయంలో నొప్పి రావడంతో గ్యాస్ నొప్పి అనుకొని నిర్లక్ష్యం చేశాడని క్లీనర్ చెప్పాడన్నారు. గురువారం మధ్యాహ్నానికి నొప్పి ఎక్కువ కావడంతో డ్రైవర్ సీట్ లోనే కుప్పకూలి కింద పడిపోయడన్నారు. యానాం జిజిహెచ్‌కు తరలించగా గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారన్నారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ నూకరాజు తెలిపారు.


పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

వేట్లపాలెంలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెం (14వ వార్డు), చంద్రంపాలెం (4వ వార్డు) గ్రామ పంచాయితీల్లో ఖాళీగా ఉన్న వార్డ్ మెంబర్ పోస్టులకు ఎన్నిక జరగనున్న నేపథ్యంలో గురువారం మండలంలోని వేట్లపాలెంలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ నెం.1లో పోలింగ్ స్టేషన్ నెం.14ఎ, 14బిలను ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణసత్యారెడ్డి తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లుపై పలు సూచనలు ఇచ్చారు. ఆ పంచాయితీలలోని ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకూ కోడ్ అఫ్ కండక్ట్ అమలులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. 19వ తేదీన పోలింగ్ జరుగు రోజు, 18వ తేదీ ముందు రోజు ఆయా గ్రామ పంచాయితీలలో పబ్లిక్ హాలిడే ప్రకటించాలని తెలిపారు.

జార్జిపేటలో జోరుగా ప్రచారం, ర్యాలీలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

జార్జిపేట పంచాయతీ ఉప ఎన్నికకు సంబంధించి ప్రచారం ఆఖరి రోజు ప్రచారం హోరెత్తింది. దీంట్లో భాగంగా ఉంగరం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని రెడ్డి భాగ్యలక్ష్మి ర్యాలీ చేశారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గుత్తుల సత్యవేణి ర్యాలీ నిర్వహించారు. ఇద్దరూ అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీ చేయడంతో జార్జిపేట పంచాయతీలో ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకుంది. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలతో ప్రచారం ముగియనుండడంతో వైసిపి, టిడిపి నాయకులు గ్రామంలో ర్యాలీలు చేపట్టారు.

కాలువ పూడ్చివేతతో కాకినాడ ముంపు

ప్రజాశక్తి-కాకినాడ

సామర్లకోట నుంచి కాకినాడ వైపు వచ్చే సామర్లకోట ప్రవాహానికి అడ్డుగా తూరలు వేసి కాకినాడ నుంచి నగరాన్ని ముంచేందుకు రియల్ వ్యాపారులు సిద్ధమవుతున్నారని నగర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు ఆందోళన వ్యక్తం చేశారు. అడుగడుగునా ప్రయివేటు వంతెనలు నిర్మిస్తుండడం వల్ల కాకినాడ నగర ప్రజలు పరిసర ప్రాంత గ్రామాలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ప్రతాప్ నగర్ వంతెన లైనులో కెనాల్‌లో మాధవపట్నం తూర్పు వైపున కొత్తగా తూరలు వేసి రెండు మార్గాలు ఏర్పాటయ్యాయని, ఇవి ప్రత్యేకంగా అక్కడి భూములు రియల్ ఎస్టేట్గా మార్కెట్ ధర పెరగడం కోసం చేసిన మాఫియా ఆగడాలుగా పేర్కొంటున్నారని రాజు చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రియల్ వ్యాపారాల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని దూసర్లపూడి కోరారు.


మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం అమలాపురం లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. రాయుడు శ్రీరామచంద్రమూర్తి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహ రావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, యాలంగి వరప్రసాద్, సేవారత్న కరాటం ప్రవీణ్ ప్రసంగించారు. అనంతరం పలు ప్రాంతాల్లో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డి కె.శ్రావణ్ దిలీప్, బి.శ్రీనివాస్,స్నేహిత, దివ్య,డా.కె. హేమావిజిత,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్ఐలకు సిఐలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-ఆలమూరు


సిఐలు విద్యాసాగర్, దొరరాజు, క్రాంతి కుమార్

స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐలుగా పనిచేసి ముగ్గురు గురువారం సిఐలుగా ఉద్యోగోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఎస్ఐగా సిహెచ్. విద్యాసాగర్‌కి ఆలమూరు పోలీస్ స్టేషన్ నందు తొలి పోస్టింగ్. పోలీసు స్టేషను భవన నిర్మాణానికి ఆయన కృషి చేశారు. సుదీర్ఘ కాలం పాటు ఎస్ఐగా పనిచేసి ఆ తర్వాత మండపేట రూరల్, రావులపాలెం, ఏలేశ్వరం, శంకవరం స్టేషన్లో ఎస్ఐగా పనిచేశారు. ఆ పక్కనున్న పి.దొరరాజు కూడా ఆలమూరు ఎస్ఐగా ఎక్కువ కాలం పనిచేసి మంచి గుర్తింపు పొందారు. మరో పక్కనున్న టి. క్రాంతి కుమార్ తక్కువ సమయం ఆలమూరులో పని చేసినప్పటికీ అందరి మన్ననలు అందుకున్నారు. ఈ ముగ్గురు సిఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు


కిట్ అందజేస్తున్నసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

చెముడు లంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్టిఎస్ఎన్ఎం హైస్కూల్ విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 5 వేలు వాలీబాల్ కిట్టు గురువారం అందజేశారు. కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివరాం కుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ సుంకర శ్రీనివాస్, వైసిపి నేతలు అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, మోటూరి సురేష్, దండుపాటి శ్రీను, బుడ్డిగ వీర వెంకటరావు, పెంటపాటి వెంకన్న పాల్గొన్నారు.

నేడు ఉచితవైద్యశిబిరం

ప్రజాశక్తి-రావులపాలెం(ఆత్రేయపురం)

రావులపాలెం సత్య సాయి సేవా కేంద్రం నందు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలియజేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకూ హోమియో వైద్య సేవలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వైద్య నిపుణులు చర్మవ్యాధులు మరి యు దంత వైద్య సేవలు నిర్వహించి మం దులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు


గంగాధర్ ను అభినందిస్తున్న ఎంఎల్‌సి తోట తదితరులు

సొసైటీ అభివృద్ధికి నూతన కమిటీ పాటుపడాలి

ప్రజాశక్తి-మండపేట

ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సొసైటీ అబివృద్ధికి నూతన కమిటీ పాటుపడాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం మండపేట పిఎసిఎస్ ఛైర్మన్ గా నియమితులైన పెంకే గంగాధర్ అభినందన సభ స్థానిక ఆలమూరు రోడ్డులోని కల్యాణ మండపంలో జరిగింది. మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అబ్జర్వర్ వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్రనేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ బిసి సంక్షేమానికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు సొసైటీ ఛైర్మన్ గంగాధర్, రామలక్ష్మి దంపతులను ఎంఎల్ఎ తోట తదితరులు ఘనంగాసత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, దేవస్థానం ఛైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, వైసిపి నాయకులు పిల్లావీరబాబు, దుగ్గిరాల రాంబాబు, లేగా వెంకన్న, తాడి రామారావు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మికి నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రగతి శీల ప్రజాసంఘం నాయకులు వీరబోయిన అనంత లక్ష్మికి ఎ ఐకెఎంఎస్, పిడిఎస్‌యు, పివైఎల్ ప్రజా సంఘాలు ఘన నివాళి అర్పించారు. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో స్థానిక బీసీ పేట లో వీరబోయిన అనంతలక్ష్మి స్వగ్రామం లో ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఎఐకెఎం ఎస్ జిల్లా నాయకులు వి.భీమా శంకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధు, పివైఎల్ జిల్లా నాయకులు అంబటి కష్ణ మాట్లాడుతూ రామచంద్రపురం మండలంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలుగా, వెల్ల గ్రామ రైతు కూలీ సంఘం కమిటీ సభ్యురాలుగా 15 సంవత్సరాలు నుండి వీరబోయిన అనంత లక్ష్మి పని చేస్తోందన్నారు. ఆమె అనారోగ్యంతో ఈ నెల 8న చిన్నవయసులోనే మరణించిందని అన్నారు. అనంత లక్ష్మి కుటుంబానికి ప్రజా సంఘాలు నాయకులు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ నాయకులు చింతా రాజా రెడ్డి, వి.బుజ్జి, నగేష్, వరలక్ష్మి, నాగరాజు, వాసు తదితరులుపాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని సర్పంచ్ సలాది ఊర్మిళా దేవి అన్నారు. విలసవిల్లి సచివాల యంలో గురువారం పిఎంఎజెఎవై పథకం ద్వారా ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలను సర్పంచ్ ఊర్మిళాదేవి పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ప్రకతి వ్యవసాయ సిబ్బంది జి. రామకృష్ణ, కె.మల్లికార్జునరావు, ఎం.సూరిబాబు, దినేష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి రామచంద్రపురం

వర్షాకాలం వచ్చినప్పటికీ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలై రెండవ వారం నుంచి సుమారుగా నెల రోజుల తరువాత ఎట్టకేల కు గురువారం వర్షం కురిసింది. గురువారం కురిసిన వర్షం వల్ల వాతావరణం కాస్త చల్లబడింది. ఇప్పటివరకు కురవలసిన వర్షాపాతం నమోదు కాకపోవడంతో వంటకాలవల లోనూ సాగునీరు లభ్యత అంతంత మాత్రమే ఉంది. ప్రస్తుతం అల్పపీడనద్రోణి ఏర్పడి మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.